# విపశ్యన మాసపత్రిక

VOLUME:12 NO - 03 1 JUNE, 2018

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

## "ధర్మవాణి"

పమాదం అప్పమాదేన, యదా నుదతి పండితో।
పఞ్ఞా, పసాదమారూహ్య, అశోకో శోకినిమ్ పజం।
పబ్బతట్ఠోవ్ భూమట్ఠే, ధీరో బాలె అవేఖ్ఖతి॥

ధమ్మపద 27, అప్పమాదవగ్గో

ఎవరైతే తన వివేకంతో ప్రమాదాన్ని అప్రమత్తతో దూరం చేసుకుంటారో, అట్టివారు ప్రజ్ఞారూఢులై శోక రహితులవుతారు. అలాంటి శోక రహితధీరులు, పర్వత శిఖరంపైన ఉన్న వారు, క్రింద ఉన్న వారిని ఎలా చూడగలుగుతారో, అలా శోకగ్రస్త జనులను చూస్తారు.

## ధమ్మ విముత్తి, కుశీనగర్(ఉ.ప్ర), ధర్మయాత్ర

**(ధర్మయాత్ర సందర్భంగా పాత సాధకులనుద్దేశించి పూజ్య గురూజీ గారు ఇచ్చిన ప్రవచనము. 2017 ఏప్రియల్ "విపశ్యన" హిందీ పత్రిక నుండి గ్రహింపబడినది.)**

**నా ప్రియమైన విపశ్యన సాధకులారా!**

ఈ రోజు మనమొక అత్యంత విశేషత కలిగిన ప్రదేశంలో సమావేషమైనాము. ఇక్కడే ఒక మహాపురుషుని సుదీర్ఘ జీవన యాత్ర పూర్తి అయినది. అనేక కల్పాలకు పూర్వం ఈ వ్యక్తి సుమేధుడనబడే బ్రాహ్మణ తపస్విగా ఉండేవాడు. ఆ సమయంలో దీపంకరుడనే సమ్యక్ సంబుద్ధుడు ఉత్పన్నమై ఉన్నాడు. ఒకసారి సుమేధుడు, దీపంకరుని కలుసుకోవటం జరుగుతుంది. అప్పుడు సుమేధుని మనసులో అత్యంత దృఢమైన ధర్మ సంవేగం (సత్సంకల్పం) జాగృతమవుతుంది. "నేను కూడా వీరిలాగే సమ్యక్ సంబుద్ధుడనైతే అనేక మందికి మేలు చేయగలుగుతాను" అని తలంచుతాడు. తన సంకల్పాన్ని దీపంకరుని ముందు ప్రకటిస్తాడు.

అనేక మంది సమ్యక్ సంబుద్ధులనుంచి ప్రేరణ పొందుతాడు. ఆహా! వీరు అనేక మందికి మేలు చేస్తున్నారు. వారి వారి దుఃఖాల్లో నుండి వారు బయటకు రాగలిగేటట్లు చేస్తున్నారు. లోకంలో ఎప్పుడైనా సమ్యక్ సంబుద్ధుడు ఉత్పన్నమైనపుడు అనేకమంది వారిని చూసి ప్రేరణ పొందుతారు. నేను కూడా ఆ స్థితికి ఎదిగి అనేకమందికి మేలు చేయగలగాలి అనుకుంటారు. వారి ఎదుట వీరి సత్సంకల్పాన్ని వ్యక్తపరుస్తారు. ఇలా వ్యక్తపరిచిన వారిని సమ్యక్ సంబుద్ధుడు పరిశీలనగా చూస్తాడు. ఈ వ్యక్తి సమ్యక్ సంబుద్ధుడు అవడానికి అవసరమైన యోగ్యత కలిగి ఉన్నాడా, లేదా అని చూస్తాడు. ప్రస్తుతానికి ఇతనికా యోగ్యతా లేకపోతే, చిరునవ్వు నవ్వి ఊరుకుంటాడు. ఇతనికా యోగ్యత ఉన్నట్లయితే, ఇతనిలో జాగృతమైన లోకసేవా తత్పరత స్థిరమైనదా, శాశ్వతమైనదా లేక ఈ సమయ, పరిస్థితుల కారణంగా ఈ రోజు ఉండి రేపు సమాప్తమవుతుందా! ఇతనిలోని భావన ఎంత దృఢంగా ఉంది అని పరిశీలిస్తాడు.

రెండో విషయం, ఇతనిలో ఎంత క్షమత ఉంది? గతంలోని అనేక జన్మలలో తన పారమితలను పూర్తి చేసుకున్నాడా? పారమితలను ఏమాత్రం వృద్ధి చేసుకున్నాడు? ఎవరైనా సమ్యక్ సంబుద్ధుడు విపశ్యన విద్యను నేర్పితే, నేర్చుకుని తన సాధనతో అరహంతుడు కాగలడా? దుఃఖ విముక్తుడు కాగలడా? ఆ మేరకు తన పారమితలను పూర్తి చేసుకున్నాడా? అలా ఉన్నప్పుడు అతని భవిష్యత్తును పరిశీలిస్తాడు. ఈ వ్యక్తి తక్షణమే ముక్తుడు అయ్యేస్థితిలో ఉన్నాడు. కానీ తన ఒక్కడి ముక్తే కోరుకోవటం లేదు. అనేక మంది ముక్తికి దోహదపడగల సమ్యక్ సంబుద్ధుడు కావలనుకొంటున్నాడు. ఇవే పారమితలను అనేక రెట్లు పెంపొందించుకోవాలి. అనేక జన్మల పాటు ఎంతో కఠోర శ్రమకోర్చి సాధన చేస్తుండాలి. ఇవన్నీ తెలిసి కూడా అతను సమ్యక్ సంబుద్ధుడు కావాలనుకుంటున్నాడా? అంతటి త్యాగ గుణం ఇతనిలో ఉందా? అనేది పరిశీలిస్తాడు.

సమ్యక్ సంబుద్ధుని ద్వారా ఈ విద్యను నేర్చుకుని, నేను తక్షణమే ముక్తుడనుకాగలను అనే విషయం ఇతనికి పూర్తిగా తెలుసు. కానీ అతనికి అందివచ్చిన ముక్తిని త్యాగం చేస్తాడు. నా ఒక్కడి ముక్తితో ఏమవుతుంది? ఈ సమ్యక్ సంబుద్ధుడు బోధిసత్వుని రూపంలో అనేక జన్మలలో ఎంతో మందికి ఎన్నో రకాలుగా మేలు చేసాడు. తన పారమితలను వృద్ధి చేసుకున్నాడు. నేను కూడా అలాగే ఎన్ని జన్మలైనా, ఎన్ని కష్టాలను ఎదుర్కొనైనా, నా పారమితలను పెంచుకుంటాను. సమ్యక్ సంబుద్ధుడను కాగలిగే స్థితికి చేరుకుంటాను అని సంకల్పించుకుంటాడు.

చేతికంది వచ్చిన ముక్తిని వదులుకోవటమే కాకుండా అనేక మంది హితం కొరకు, లోక కళ్యాణం కొరకు ఎన్ని జన్మల కష్టాలనైనా సహించటానికి సిద్ధంగా ఉన్నాడు. ఈతని మానసిక స్థితిని చూచిన దీపంకరుడు ఇతను నిజంగానే యోగ్యుడు, సమర్థుడు అని తలచి సుమేధుని భవిష్యత్తు చూస్తాడు. ఎంతకాలం తరువాత ఇతను సమ్యక్ సంబుద్ధుడు అవుతాడనేది చూస్తాడు. తన భవిష్యవాణిని వినిపిస్తాడు. అనేక కల్పాల తదుపరి కపిలవస్తు నగరంలో శుద్ధోదన మహారాజు ఇంటిలో పట్టపురాణి మహామాయ గర్భాన జన్మిస్తావు. ఆ జన్మలో నీవు సమ్యక్ సంబుద్ధుడవు అవుతావు. అప్పటి నుండి ఈ వ్యక్తి రకరకాల జన్మలెత్తుతూ తన పారమితలను వృద్ధి చేసుకుంటున్నాడు. ఏ ప్రాణి సమూహంలో జన్మించినా, ఆ ప్రాణులకు సేవచేస్తూ ధర్మంవైపు ఆకర్షితులైయ్యేటట్లు

చేస్తూ తన పారమితలను పుష్టి చేసుకుంటున్నాడు. ఇలా అనేక కల్పాలు గడిచిపోయిన తదుపరి, సిద్ధార్థగౌతమునిగా జన్మిస్తాడు. ఆస్థాన జ్యోతిష్కులు ఈ బాలుని శరీర లక్షణాలను చూచి ఇంటిలో ఉన్నట్లైతే గొప్ప చక్రవర్తి అవుతాడు, గృహత్యాగి అయితే సమ్యక్ సంబుద్ధుడు అవుతాడు అని చెపుతారు. అతను చక్రవర్తి కావాలనుకోలేదు. సమ్యక్ సంబుద్ధుడు కావాలనుకొన్నాడు. సమ్యక్ సంబుద్ధుడైనాడు.

బుద్ధగయలో బోధి వృక్షం క్రింద అతనికి సమ్యక్ సంబోధి ప్రాప్తించింది. విముక్తి ప్రాప్తించింది. అనేక జన్మల నుండి లోకసేవ చేస్తున్నాడు. 29 సం॥ల ప్రాయంలో గృహత్యాగి అయినాడు. 35 సం॥ల ప్రాయంలో సమ్యక్ సంబుద్ధుడైనాడు. తదుపరి తను జీవించిన 45 సం॥లు లోక సేవలోనే గడిపాడు. రాత్రిపూట 2/3 గంటలు సతి(ఎరుక) సంపజన్య(సమ్యక్ ప్రజ్ఞ)తో పడుకునేవాడు. మిగతా సమయాన్నంతా లోక సేవలో గడిపేవాడు. అనంతమైన కరుణతో లోక సేవ చేసేవాడు. అలా చేస్తూ చేస్తూ ఇదే ప్రదేశంలో శరీరాన్ని వదలి మహా పరినిర్వాణం పొందాడు.

ఎప్పుడైతే ఇంద్రియాలన్నీ పనిచేయటం మానేస్తాయో ఆ స్థితిని నిర్వాణస్థితి అంటారు. విపశ్యన అభ్యాసం చేస్తూ పోతే ఆ స్థితికి చేరుకుంటాము. మనో వికారాలు నశించిపోతూ, మనలను అధోగతికి చేర్చే కర్మ సంస్కారాలన్నీ పూర్తిగా నశించిపోయిన పిదప తొలిసారిగా నిర్వాణస్థితి ప్రాప్తిస్తుంది. అప్పుడు అతనిని సోతాపన్న అంటారు. అప్పుడు అతనికి అథోగతికి వెళ్ళే సంస్కారాలన్నీ నశించిపోతాయి. మహా అయితే తిరిగి ఏడు సార్లు జన్మిస్తాడు. అలా సాధన చేస్తూ "సకదాగామి" స్థితిని పొందుతాడు. అప్పుడు కామలోకమైన ఈ మనుష్యలోకంలో గాని లేదా దేవలోకంలో గాని ఒక్కసారి జన్మిస్తాడు. "అనాగామి" స్థితికి వస్తే కేవలం బ్రహ్మలోకంలోనే జన్మిస్తాడు. ఇలా సాధన చేస్తూ చేస్తూ అరహంతుడవుతాడు. లోకాలన్నింటి నుండి ముక్తుడవుతాడు.

సమ్యక్ సంబుద్ధుడు అయినపుడు ఈ నాలుగు అవస్థలు ఒకదాని తరువాత ఒకటిగా ప్రాప్తిస్తాయి. సమ్యక్ సంబుద్ధుడైనపుడు సంపూర్ణముక్తుడైనాడు. ఇది నిర్వాణస్థితి. దీనిని "స ఉపధిశేష నిర్వాణ" అంటారు. ఇంకా ఉపధి (సంస్కారం) ఉంది. అరహంతుడైనాడు. మరో జన్మనిచ్చే కర్మ సంస్కారాలు పూర్తిగా విచ్ఛిన్నమై పోయినాయి. కానీ ఈ జన్మను కొనసాగించటానికి, ఈ శరీరాన్ని నిర్వహించటానికి కర్మ జరుగుతూనే ఉంది. మరోజన్మకు తావులేని సంస్కారాలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి వ్యక్తి, ఆ మహాపురుషుని, అరహంతుని శరీరచ్యుతి అయితే వారికి మరో జన్మేది ఉండదు. అనగా "అనుపధిశేషము", ఏ విధమైన సంస్కారాలు కూడా లేని స్థితి, పరి నిర్వాణం, పరిపూర్ణ నిర్వాణం జరిగింది. అందుకనే అలాంటి మహాపురుషుడిది మహాపరి నిర్వాణం అన్నారు. ఆ మహాపురుషుని 'మహాపరినిర్వాణం' ఈ ప్రదేశంలో ప్రాప్తించింది.

ఆ వ్యక్తిలో అనంతమైన కరుణ ఉంది. అనంతమైన కరుణ ఉంది కాబట్టే జన్మ జన్మల నుండి లోకసేవ చేస్తూ వస్తున్నాడు. ఈ జన్మలో కూడా కరుణాభరితుడై ఉన్నాడు. మహాపరినిర్వాణ సమయం సమీపిస్తుంది. వైశాలిలో ఉన్నప్పుడు వచ్చే వైశాఖ పూర్ణిమనాడు దేహాన్ని వదిలిపెడతాను అని మూడు నెలల ముందే ప్రకటిస్తాడు. అక్కడి నుండి నడుచుకుంటూ ఈ మూడు నెలల కాలంలో ఇక్కడికి వచ్చాడు. మహాపరి నిర్వాణానికి ఒక్కరోజు ముందు ఛుంద్ అనే గృహస్థుడు ఈ భిక్కు సమూహానికి భోజన ఏర్పాట్లు చేస్తాడు. అది విషతుల్యమైన ఆహారం. ఈ వ్యక్తి ఆ భోజనాన్ని ఆరగిస్తాడు, కానీ ఇతర భిక్కువులను తినవద్దని చెపుతాడు. అతను పరినిర్వాణం కాబోతున్నాడు. కానీ ఆ గృహస్థు ఛుంద్ పై అనంతమైన కరుణ కలుగుతుంది. నేను పోయిన తరువాత అందరూ ఈ ఛుంద్‌ను ఆరోపిస్తారు, నిందిస్తారు. అలాంటి మహాపురుషుని దేహచ్యుతికి కారణమైనావని నిందిస్తారు. ఆనందుని పంపుతాడు. సమ్యక్ సంబుద్ధుడు కావటానికి పూర్వం తిన్న అంతిమ భోజనానికి ఎంత పుణ్యప్రదమైనదో, అలాగే పరినిర్వాణంకంటే ముందు తీసుకున్న చివరి భోజనం కూడా అంతే పుణ్యప్రదమైనది అని చెప్పమంటాడు. బుద్ధత్వం ప్రాప్తించక ముందు సుజాత ఇచ్చిన పాయసమే అతని చివరి భోజనం. అటు పిమ్మట అతను సమ్యక్ సంబుద్ధుడవుతాడు. సుజాతది ఎంతో పుణ్యప్రదమైన కర్మ. అలాగే అనేక జన్మల నుండి ఈ భవచక్రంలో తిరుగాడుతున్న ఈ వ్యక్తికి భవచక్రం ఆగిపోతుంది. పునర్జన్మ ఉండదు. ఈ అంతిమ భోజనం తదుపరి దేహచ్యుతి అవుతుంది. ఇది ఎంతో పుణ్యప్రదమైన కర్మ. ఛుంద్ మనసులో ఏ విధమైన అలజడి కలగకూడదు. ప్రజలు కూడా అతనిని దోషిగా చూడకూడదు. ఆహా! నిజంగా ఈ వ్యక్తి ఎంత కరుణామయుడు.

ఇక్కడే జంటగా ఉన్న చాలా వృక్షాల క్రింద ఆగి, ఆనంద్! నా యాత్ర పూర్తైనది. ఈ చెట్ల క్రిందే విశ్రమిస్తాను. రేపు సూర్యోదయం అవుతూనే ప్రాణత్యాగం చేస్తాను. మహాపరినిర్వాణం పొందుతాను. ఈ విషయం చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు చెప్పిరా! లేకపోతే నీ మీద నిందారోపణ కలగవచ్చు. చూసావా భగవానుడు ఇక్కడి దాకా వచ్చి మహాపరినిర్వాణం పొందితే, ఆనందుడు కనీసం మాకు మాటమాత్రమైనా చెప్పలేదు. చిట్టచివరిగా ఆ మహాపురుషుని దర్శనం చేసుకునేవాళ్ళం అని అనవచ్చు. అలాగే ఆనందుడు వెళ్ళి చుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలకు ఈ వార్త తెలియచేసి వస్తాడు.

ప్రజలు రావటం మొదలవుతుంది. సంఖ్య పెరుగుతుంది. సమయం చాలా తక్కువగా ఉంది. వరుసగా వచ్చి నమస్కారం చేసి వెళ్ళిపోండి అని ఆనందుడు చెపుతుంటాడు. ఆ వరుసలో సుభద్రుడనే ఒక వ్యక్తి వస్తాడు. నేను కేవలం నమస్కారం చేసి పోవటానికి రాలేదు. వీరి నుండి ధర్మం నేర్చుకుందామని వచ్చాను. ఈ మహాపురుషుని తదుపరి మీరు ధర్మం సరిగా నేర్పుతారో నేర్పరో. నేను ఈయన వద్దే ధర్మం నేర్చుకుంటాను. అని పట్టుపడతాడు. నీవు పిచ్చివాడిలాగా ఉన్నావు. అయన ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నారు. అంతిమ ఘడియలలో ఆయనని ప్రశాంతంగాక పోనీ. నమస్కారం చేయటం నీకిష్టంలేకపోతే ప్రక్కకు తప్పుకో వేరే వాళ్ళని రాని అని ఆనందుడు చెపుతాడు. ఆ మాటలు బుద్ధుని చెవిలో పడతాయి. అరె! ఆనంద్! అతను యోగ్యుడు, అతనిని రాని అని చెప్పి అతనికి ధర్మం బోధిస్తాడు. చివరి క్షణాలలో కూడా పోతూ పోతూ ఒకరికి మేలు చేసి పోతాడు. ఎవరైనా దాహార్తితో గంగా నది ఒడ్డుకు వస్తే, అతని చేయిపట్టుకుని నీవు నీళ్ళు తాగటానికి వీలులేదు, కేవలం నమస్కారం చేసి వెళ్లు అంటే, ఆ గంగా నదే పెల్లుబికి ఇతని దాహాన్ని తీర్చింది. ఇది మహాపురుషుల లక్షణం. వారు ఎల్లవేళలా కరుణాభరితులై ఉంటారు. ఈ మహా పురుషునిలో శరీరచ్యుతి అయ్యే సమయంలో కూడా కరుణ ఉప్పొంగి సుభద్రునికి ధర్మాన్ని బోధిస్తాడు.

ఈ ప్రదేశంలోనే ఇంకొన్ని విశిష్టమైన సంఘటనలు జరిగినై.

అత్యంత విశిష్టమైనది బుద్ధుని తదుపరి ఉత్తరాధికారి ఎవరనేది? ఎవరో అడిగిన ప్రశ్నకు బుద్ధుడు ఈ విధంగా సమాధానం చెపుతాడు. ధర్మమే మీ ఉత్తరాధికారి అవుతుంది. ఏ ధర్మమైతే నేను మీకు నేర్పానో అదే మీ ఉత్తరాధికారి. అదే మీ గురువు అవుతుంది. ధర్మమే మీ ఆచార్యుడవుతుంది. ఎవరైనా ఒక వ్యక్తిని ఉత్తరాధికారిగా ఉంచితే, వ్యక్తి పూజ మొదలవుతుంది. పండిత వ్యవస్థ, పురోహిత వ్యవస్థ మొదలవుతుంది. పరిపూర్ణ బుద్ధత్వం ప్రాప్తించనంత వరకు ప్రతివారిలో ఒక నిషా ఉంటుంది. బుద్ధుని అందరూ ఏ విధంగా సన్మానించారో అలాగే ఇప్పుడు నన్ను కూడా అందరూ సన్మానించాలి. బుద్ధుని పీఠంపై ఇప్పుడు నేను కూర్చుని ఉన్నాను. కాబట్టి నన్ను కూడా సన్మానించాలి. ఈ నిషా ధర్మాన్ని ముంచేస్తుంది. అందువలన నా తదుపరి ఉత్తరాధికారిగా ఎవరూ ఉండరు. ధర్మమే మీ ఉత్తరాధికారి అవుతుంది. ధర్మాన్ని మీకు చక్కగా బోధించాను. ఎవరైతే చక్కగా ధర్మాన్ని పాటిస్తారో, ధర్మ జీవనం జీవిస్తారో వారు పురోగమిస్తారు. వారికి వారు మేలు చేసుకుంటారు. ఇంకేమి కావాలి?

ఇంకో విశిష్ఠమైన సంఘటన జరిగింది. బుద్ధుని మహా పరినిర్వాణం జరిగింది. అతని ప్రముఖ శిష్యుడైన మహాకశ్యపుడు చేరుకోవటానికి ఇంకా ఏడు రోజుల సమయం పడుతుంది. మహాకశ్యపుడు చేరుకునేటంత వరకు దహనక్రియ జరుపలేదు. మహాకశ్యపుడు అతని 500ల మంది శిష్య బృందంతో వస్తున్నాడు. ఆ శిష్య బృందంలో సుభద్రుడనే ఒక భిక్షువు ఉన్నాడు. అతను వయస్సులో పెద్దవాడు. కానీ ధర్మంలో ఇంకా ఎదగలేదు. బుద్ధుని మహాపరినిర్వాణ వార్త తెలియగానే, చాలా సంతోషిస్తాడు. ఆహా! బాగా జరిగింది. ముసలాడు చచ్చిపోయినాడు. ఊపిరి సలపనిచ్చేవాడు కాదు. ఇక ఇది చెయ్యి, ఇది చెయ్యవద్దు అని చెప్పేవాళ్ళెవరూ ఉండరు. అన్ని నియమాల నుండి విముక్తి లభించింది. ఇక మనకేమి చెయ్యాలి అనిపిస్తే అది చెయ్యొచ్చు. నచ్చకపోతే చెయ్యక్కరలేదు. అని సంతోషిస్తుంటాడు. ఈ విషయం మహాకశ్యపుని చెవిన పడుతుంది. అతను ఆలోచిస్తాడు. అరె సంఘంలో చాలా మంది ధర్మంలో పరిపక్వత చెందినవారు ఉన్నప్పటికి, ఇలాంటి ఒకళ్ళిద్దరు పిచ్చివాళ్ళు చేరుతుంటారు. ఇప్పుడే ఇట్లా ఉంటే, ఇక బుద్ధుని తరువాత ఇలాంటి పిచ్చివారి సంఖ్య పెరగవచ్చు. ధర్మానికి హాని జరగవచ్చు. వాళ్ళకి తోచినదల్లా మాట్లాడి, బుద్ధ భగవానుడు ఇలా చెప్పేవాడు అనవచ్చు. లేదా బుద్ధవాణిలో నుండి వారికి నచ్చని విషయాలను తొలగించవచ్చు. కాబట్టి బుద్ధవాణిని అంతటిని సంగ్రహపరిచి భద్రపరచాలి అని అనుకుంటాడు.

ఏడు రోజుల తరువాత దహన సంస్కారాలు పూర్తి అయినాయి. మూడు నెలల తరువాత, రాజగిరిలో మొదటి సంగాయనం జరిగింది. అక్కడ కొండపైన ఉన్న సప్తపర్ణి గుహలను మనం చూసాం కదా! బహుశా అక్కడ కూర్చొని ఉంటారు. బుద్ధుని సమీప అనుచరులు, అరహంతులు అయిన 500ల మంది భిక్షువులు ఒక దగ్గర చేరి బుద్ధవాణిని వినిపించారు. బుద్ధుడు ఫలానా సమయంలో ఫలానా చోట ఫలానా వారికి ఈ విధంగా బోధించాడు అని పలికేవారు. అది అందరూ విని సరియైనదని పోల్చుకునే వారు. ఈ విధంగా మొదటి సంగాయనం జరిగింది. ఉపాలి అనే భిక్షువు అందరు భిక్షువులకు ఆచార్యుడుగా ఉండేవాడు. వినయ సూత్రాలు, అనగా భిక్షువుల నియమాళియందు ఉపాలికి మంచి అవగాహన ఉంది. ఈ వినయ నియమాలను ఉపాలి వినిపించేవాడు. అందరూ అవి సరియైనవి అని పోల్చుకుని స్వీకరించేవారు. మిగిలిన బోధనల్నింటిని ఆనందుడు వినిపించాడు. ఈ విధంగా 500 మంది అరహంతులు ఒకచోట కూడి బుద్ధవాణిని గానం చేసి సరియైనది అని పోల్చుకుని నిర్ధారించారు. ఆరోజులలో ఇప్పటిలాగా ప్రింటింగ్ ప్రెస్‌గాని, కాగితాలు, కలాలు గాని లేవుకదా! గురు-శిష్య పరంపరద్వారా బుద్ధవాణిని కాపాడుకుంటూ వచ్చారు. ఇది ఎంతో అద్భుతమైన విషయం. ఈ విధమైన మొదటి సంగాయనం జరగకపోతే ఎవరికి ఇష్టమొచ్చినట్లు వాళ్ళు చెప్పేవారు. ఇదే బుద్ధుడు చెప్పింది అనేవారు. ప్రామాణికత లేకుండా పోయేది. నిజంగా ఇది జరగటం ఎంతో అమూల్యమైన సంఘటన. ఈ 500 మంది అరహంతులు కలిసి ఇది ప్రామాణికమైన బుద్ధవాణి, దీనికి ఏమీ జోడించరాదు, ఇందులో నుండి ఏమీ తొలగించరాదు అని నిర్ణయించారు. ఈ తొలి సంగాయనం ధర్మాన్ని కలుషితంకాకుండా కాపాడింది. ధర్మాన్ని రక్షించింది. ఆ విధంగా కాలక్రమేపి అప్పుడప్పుడూ రెండోది, మూడోది.....అలా సంగాయనాలు జరుగుతూ వస్తున్నాయి. బుద్ధుని తదుపరి 2,500 సం॥ల తరువాత ఇటీవలే బర్మాలో ఆరవ సంగాయనం జరిగింది. బర్మా, థాయ్‌లాండ్, శ్రీలంక, కంబోడియా, లావోస్ దేశాలు బుద్ధవాణిని రక్షిస్తూ వచ్చాయి. ఆ దేశాలనుండి వచ్చిన, 2,500 మంది నిష్ణాతులైన భిక్షువులు పాలి భాషలో నిక్షిప్తమై ఉన్న బుద్ధవాణిని తిరిగి వినిపించారు. అందరూ వినిపించినవి ఒకటా కాదా అని సరి పోల్చుకున్నారు. ఈ విధంగా ఇప్పటికి ఆరుసార్లు బుద్ధవాణిని ప్రమాణీకరించారు. ......(సశేషం)

## బుద్ధ జయంతి - విపశ్యన సాధన

**(సాధకులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ది 9-04-1977)**

ప్రియమైన ఈశ్వర్‌చంద్‌కు శుభాకాంక్షలు.

మార్చి, 30 నాటి మీ ఉత్తరం అందింది. మీరంతా మీ శక్తి కొలది విపశ్యన ధ్యానం చేస్తున్నారని, ప్రతి ఆదివారము కలిసి సామూహిక సాధన చేస్తున్నారని తెలుసుకుని సంతోషిస్తున్నాను. సామూహిక సాధన వలన చాలా లాభాలు కలుగుతాయి.

గృహస్థ జీవితంలో అనేక రకాల ఆటుపోట్లు ఎదురవుతుంటాయి. ఒక్కోసారి అవి విపశ్యన సాధనలో బలపడటానికి అవరోధాలుగా మారతాయి. కానీ ఈ కష్టాలను చూసి వెనుకంజ వేయకూడదు. సాధనలో ఇంకా దృఢపడటానికే ఈ కష్టాలు మనకెదురైనై అనుకోవాలి. గృహస్థు జీవనాన్ని చూసి కలతచెందటం మంచిది కాదు.

గృహస్థ బాధ్యతల నుండి విముక్తుడై, గృహత్యాగి అయిన వ్యక్తి నిస్సందేహంగా ఎక్కువ సమయాన్ని సాధనలో ఎదగటానికి ఉపయోగించుకోగలడు. అతనికి చాలా కష్టాలు వాటంతటవే తొలగిపోతాయి.

కానీ తను ఉంటున్న సమాజంలో ఎక్కువ మంది గృహస్థులకు ధర్మంపై అవగాహన లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. ఇలాంటి సమాజంలో ఉంటూ తను సన్యాసం తీసుకుని సాధనలో పురోగమించటం అంత సులభమైన పనికాదు. గృహస్థు జీవనాన్ని సన్యసించినా ఈతి బాధలు తొలగిపోవు. అలాంటి పరిస్థితులలో గృహస్థు జీవనాన్ని కొనసాగిస్తూ సాధక బాధకాలను ఎదుర్కొంటూ మెల్ల మెల్లగా ధర్మ మార్గంలో ముందుకు పోదామనుకోవటంలో తప్పులేదు.

క్రొత్త సంస్కారాలు ఏర్పడటం, అకస్మాత్తుగా ఆగిపోవటమనేది జరగదు. అలా జరిగే చమత్కారాలేవీ ఉండవు. ఈ లక్ష్యాన్ని చేరుకునే దిశలో మన అభ్యాసమంతా ఉంటుంది. మనం సాధనలో బలపడే కొద్దీ క్రొత్త సంస్కారాలు ఏర్పడకుండా ఉండే క్షణాలు మన అనుభవంలోకి వస్తాయి. నిజానికి ఇటువంటి క్షణాలే మన పాత సంస్కారాలు నశించటాని దోహదపడతాయి.

సాధకుడు బాహ్య ప్రపంచంలో వ్యవహారిక దృష్టితో క్రియాత్మకంగా ఉండాలి. మన దైనందిన జీవితంలో ఎప్పుడైనా ఇతరుల దుష్ప్రవర్తన వలన మన క్షేమం ప్రమాదంలో చిక్కుకుంటే అప్పుడు సాధకుడు ఒక పరిధి వరకు సహనశీలతను కలిగి ఉండటం ఆవశ్యకం. కానీ అది మితిమీరినప్పుడు భావావేశానికి లోబడకుండా దృఢనిశ్చయంతో దాన్ని ఎదుర్కోవాలి. ఎవరిపైనా ద్వేషం, దుర్భావనలను కలగచేసుకోకుండా వారికి కూడా మేలు కలగాలనే స్థిర సంకల్పంతో వ్యవహరించాలి. సాధనకు విఘ్నాలను కలిగించే బాధలను ఎదుర్కొంటునప్పటకీ, సాధకులు ధర్మాన్ని అభ్యాసంచేయటం విడిచిపెట్టరనే నమ్మకం నాకుంది. సాధన కొనసాగిస్తే తప్పక సఫలీకృతులు కాగరు.

ప్రతి సంఘర్షణ ధర్మంలో బలపడటానికి దోహదపడాలి. ప్రతి ఓటమి మన మనోబలాన్ని రెట్టింపుచేయాలి. ఈ ఉత్సాహంతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు సాగిపోతూనే ఉండాలి. అనంతమైన ధర్మ శక్తులు మనకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయి. మనం మన మనసును ధర్మ మార్గంలో నడవటానికి, సిద్ధం చేసుకోవాలని సంకల్పించుకున్నప్పుడల్లా ఈ అనంతమైన ధర్మ శక్తులన్నీ మనకు మార్గదర్శకులుగా ఉంటాయి. ఇది తిరుగులేని సత్యం.

అక్కడ, సాధకులు బుద్ధ జయంతిని చాలా ఘనంగా జరుపుకోవాలనుకోవటం మంచిదే. ఆ సందర్భంగా ఎవరైనా స్వయం శిబిరం (self-course) నిర్వహించుకోవాలనుకుంటే, బుద్ధ జయంతిని జరుపుకోవటానికి ఇంతకంటే శ్రేష్ఠమైన పద్ధతి మరొకటి ఉండదని నాకు అనిపిస్తుంది. బుద్ధ జయంతి, బుద్ధ భగవానుని సన్మానించుట కొరకు, పూజించుట కొరకు. ఆయనకు పూజ ఏవిధంగా చేయాలి, **"ఇమాయ ధమ్మాను ధమ్మ పటిపత్తియ బుద్ధం పూజేమి".** స్థూల ధర్మం నుండి సూక్ష్మ ధర్మం వరకు అడుగులో అడుగు వేసుకుంటూ ధర్మ మార్గంలో నడవటం ద్వారా బుద్ధుని పూజించాలి.

నిరంతరం ధర్మాన్ని అభ్యాసం చేయటం ద్వారానే మనం బుద్ధుని సన్మానించగలము. బుద్ధ వందనము, బుద్ధ పూజ చేయగలము. ఇందుకొరకే మనం బుద్ధ జయంతిని జరుపుకుంటాము. ఈ సందర్భంగా ఇక్కడికి చేరుకున్న అందరికీ నేను చెప్పాలనుకున్న సందేశం ఒక్కటే. ఇతర ఉత్సవాలు, పండుగలు, పబ్బాలలాగా బుద్ధ జయంతిని కూడా ఒక ఉత్సవంలాగా కోలాహలంతో కూడినదై, ఆర్భాటంగా ఉంచరాదు. కేవలం బుద్ధి విలాసం, వాణీ విలాసం కొరకే దీనిని పరిమితం చేయరాదు. వచ్చినవారందరికీ శీల, సమాధి, ప్రజ్ఞలలో మరింతగా పుష్టి చెందుటకు ప్రేరణదాయకంగా ఉండాలి. అప్పుడే బుద్ధ జయంతికి విలువ ఉంటుంది. బుద్ధజయంతి సఫలీకృతమవుతుంది.

సాధకులందరికీ మేలు కలగాలని ఆశిస్తూ,
ఆశీస్సులతో, సత్యన్నారాయణ గోయంకా

## శ్రద్ధాంజలి

శ్రీమతి శకుంతల గార్గ్ గారు, 74 ఏళ్ళ వయస్సులో మార్చి 6న హైదరాబాదులో ప్రశాంతంగా అంతిమశ్వాస వదిలినారు. తొలి శిబిరం నుండే వారు చాలా గంభీర సాధకులు. వారు సహాయక ఆచార్యులుగా సేవచేస్తూ ఎంతో మంది సాధకులకు సహాయపడ్డారు. వారి సద్గతి కోరుతూ ధర్మకుటుంబం శ్రద్ధాంజలి ఘటిస్తుంది.

## కావలెను

ధమ్మ భువనేశ్వర్‌లో ఉండుటకు దీర్ఘకాలిక ధమ్మ సేవకులు కావలయును. ఆఫీస్ నిర్వహణ తదితరములైన పనులు చేయవలసి ఉంటుంది. కోరిన వారికి గౌరవ వేతనము ఇవ్వబడును. వీలైన పాత సాధకులు క్రిందివారిని సంప్రదించగలరు.

C.B. KAR, Mobile No: 9437131019.
Email: cbkar1962@gmail.com


**రెండు సంవత్సరాలకు చందా రూ 100/-** | **విపశ్యన తెలుగు మాసపత్రిక** | **జీవిత చందా రూ. 500/-**
**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** | **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** | **వెల: రూ 5/-**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)**
**ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.